నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ శనివారం 3 మే 2025 | ADILABAD NIRMAL




మాజీ మంత్రి జోగు రామన్నను సన్మానిస్తున్న గ్రామస్తులు

# బీఆర్ఎస్ హయాంలో ఆలయాల అభివృద్ధి

జైనథ్, మే 2 : తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కారు హయంలో రాష్టంలో ఆలయాల నిర్మాణాలను పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసిన అభివృద్ధికి కృషి చేసిందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని కరంజి గ్రామంలో నూతన నంద మైసమ్మ ఆలయ ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ ఆలయాల నిర్మాణాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చిందని గుర్తు చేశారు. గ్రామాల్లో అంటు వ్యాధులు దరిచేరకుండా గ్రామదేవతలు కాపాడుతాయని దృఢమైన నమ్మకంతో ఆనవాయితీగా పూజించడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట మారిశెట్టి గోవర్ధన్, మహేందర్ రెడ్డి, బిక్కి రవీందర్, తల్లా పెల్లి గంగన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

# ఇత్తడి బొమ్మల మార్కెటింగ్‌కు కృషి

**ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా**

ఉట్నూర్, ఏప్రిల్ 2 : ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు తయారు చేసిన ఇత్తడి బొమ్మలు, వస్తువులను మార్కెటింగ్ చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. శుక్రవారం ఉట్నూర్‌లోని కుమ్రంభీం ప్రాంగణంలోని పీఎంఆర్సీ భవన్‌లో ఇత్తడి వస్తువులు తయారీచేసే గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఫిక్కిఫ్లో లేడిస్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ సంయుక్తంగా మార్కెటింగ్ నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఊషేగాం, జంగాం, కేస్లాగూడ, చింతల్‌బోరి రాంపూర్, బండగూడ ప్రాంతాల్లోని 80 మంది గిరిజన కళాకారులకు ఆర్థికంగా మేలు జరుగనుంది. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కవితారెడ్డి, దీప్తి, ఐటీడీఏ జేడీఎం నాగభూషణం, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది

# బేల ఈజీఎస్ సిబ్బంది పెన్‌డౌన్

**నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన**

బేల, మే 2 : నాలుగు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో బేల ఎంపీడీవో కార్యాలయంలోని ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. వీరికి పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బేల మండల ఈజీఎస్ ఏపీవో రామన్న మాట్లాడుతూ రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు విధులను బహిష్కరించి పెన్‌డౌన్ చేపడుతున్నామని పేర్కొన్నారు. నాలుగు నెలల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల ఉపాధి హామీ సిబ్బందికి వేతనాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. వెంటనే జిల్లా అధికారులు చొరవ తీసుకొని వేతనాలు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బందితోపాటు పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# వివాదంలో నిత్యహారతి ఘాట్

బాసర, మే 2 : బాసర పుణ్యక్షేత్రంలో గోదావరి వద్ద బాసర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి బుధవారం గోదావరి నిత్యహారతి కార్యక్రమం నిర్వహించే వారు. ఇంతకు ముందు నుంచి ప్రతి రోజూ బాసరలోని వేద పాఠశాల ఆధ్వర్యంలో గోదావరి నిత్యహారతి కార్యక్రమం నిర్వహించేవారు. ఈ ఘాట్ వద్ద కొన్ని రోజులుగా వివాదాలు కొనసాగుతుండడంతో ఇక్కడ ఈ కార్యక్రమాన్ని నిలిపివేశారు. అయినా వేద పాఠశాల నుంచి కమిటీలు ఏర్పాటు చేసి నిత్యహారతిని నిర్వహించాలని నిర్ణయించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం నిర్వహించే హారతి కార్యక్రమంలో భాగంగా గత బుధవారం(ఏప్రిల్ 30)న ఆలయ అర్చకులు అక్కడ హారతి కార్యక్రమం నిర్వహించారు. వేద పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించే ఘాట్ వద్దనే నిర్వహించారు. దీంతో వేద పాఠశాల ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఇక్కడ ఎవరికీ ఆస్కారం లేకుండా తామే ట్రస్ట్ తరపున నిర్వహిస్తున్నట్లు తెలిపి గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించారు. వేద విద్యానంద గిరి స్వామి వేద భారతి పీఠం అభివృద్ధికి ట్రస్టును ఏర్పాటు చేసి వేద పాఠశాల, గోశాల, నిత్య గంగా హారతి నిర్వహిస్తున్నట్లు వేద భారతి పీఠం పండితులు తెలిపారు. లోక కల్యాణం కోసం వేద పీఠాన్ని ప్రారంభించి హైందవ ధర్మ పరిరక్షణకు వేద విద్యానంద గిరి స్వామి ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు.



బాసరలో గోదావరికి హారతి ఇస్తున్న వేద పండితులు

## పంట కొనుమంటే వంద ప్రశ్నలు వేస్తుండ్రు



రైతులు స్వయంగా పండించిన జొన్నలు అమ్మాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. కొనుగోలు కేంద్రాల పీఏసీఎస్ సిబ్బంది కాంటాకు రాయమని అడిగితే పట్టాపాసు పుస్తకం పరిశీలించి వంద ప్రశ్నలు అడుగుతున్నారు. పంట మీరు పండించారా..? కొన్నారా? సాగునీటి సౌకర్యం ఉందా? బోర్ ఉందా? ఎన్ని నాజళ్లుతో నీళ్లు పెట్టారు? అని ఇలాంటి ప్రశ్నలు వేస్తున్నారు. పట్టాదారు తప్పనిసరిగా ఉండాలని షరతు విధిస్తున్నారు. మండుటెండలో వృద్ధ రైతులు, మహిళా రైతులు మార్కెట్‌యార్డులో వేడికి తట్టుకోలేక సతమతమవుతున్నారు. పాసింగ్ రాయాలని చుట్టూ తిరుగుతున్నా కనీసం స్పందించడం లేదు. షెడ్‌లలో జాగా లేకపోగా కింద పోస్తే కొనుగోలు చేయమంటూ ఇబ్బంది పెడుతున్నారు. జొన్న కొనుగోళ్లను వెంటవెంటనే పూర్తి చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి.

*-రవి. రైతు, తలమడుగు*



ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో జొన్నలు కొనుగోలు చేయాలని పీఏసీఎస్ సిబ్బందిని వేడుకుంటున్న రైతులు

# జొన్నలు కొనేదెప్పుడో ?

● ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో మండుటెండలో రైతుల పడిగాపులు ● అకాల వర్షంతో ఆందోళన ● అధికారుల పర్యవేక్షణ లోపంతో కొనుగోళ్లలో మరింత జాప్యం

***ఆదిలాబాద్ జిల్లాలో జొన్నలు విక్రయించేందుకు మార్కెట్‌యార్డుల్లో పడిగాపులు కాస్తూ రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడు కొంటారోనని మండుటెండలో నిరీక్షిస్తున్నారు. మరో వైపు అకాల వర్షంతో చేతికి వచ్చిన పంటను కాపాడుకోడానికి తిప్పలు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో జొన్నల కొనుగోళ్లు మరింత జాప్యమవుతుందని విమర్శలు వస్తున్నాయి.***



ఆన్‌లైన్ కోసం రైతుల ఇబ్బందులు

ఆదిలాబాద్, మే 2 ( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో యాసంగిలో రైతులు 1.12 లక్షల ఎకరాల్లో జొన్న పంటను సాగు చేయగా ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం జొన్నలకు మద్దతు ధర క్వింటాకు రూ.3371 ప్రకటించగా, వారం రోజుల కిందట జిల్లాలో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా పంట కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఎకరాకు 14 క్వింటాళ్ల చొప్పున పంటను కొనుగోలు చేస్తున్నారు. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో అన్నదాతలు గంపెడాశతో పంటను విక్రయించేందుకు మార్కెట్‌యార్డుకు పెద్ద మొత్తంలో జొన్నలను తీసుకువస్తున్నారు. పంట రాశులతో మార్కెట్‌యార్డులు కళకళలాడుతున్నాయి. కొనుగోళ్లలో జాప్యంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

**రాత్రింబవళ్లు పడిగాపులు..**

గ్రామాల వారీగా ముందుగా నిర్ణయించిన తేదీల ప్రకారం పంటను కొనుగోలు చేస్తున్నారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు రైతులు ఒక రోజు ముందుగానే పంటను ట్రాక్టర్లలో నింపి తీసుకువస్తున్నారు. సాయంత్రం సమయంలో తీసుకువచ్చిన పంటను విక్రయించాలంటే మరుసటి రోజు సాయంత్రం వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. దీంతో రాత్రి మార్కెట్‌యార్డుల్లోనే నిద్రిస్తున్నారు. తమ పంటను కాంటా వేయాలని పీఏసీఎస్ సిబ్బంది చుట్టూ తిరగాల్సి వస్తుంది. మార్కెట్ యార్డులో షెడ్‌లు జొన్నలతో నిండిపోవడంతో కింద పోస్తున్నారు. దీంతో అకాల వర్షంతో ఆందోళన చెందుతున్నారు. పంట కొనాలని కొనుగోలు కేంద్రాల సిబ్బందిని అడిగితే ఆన్‌లైన్, ఇతర సమస్యలు చెబుతూ జాప్యం చేస్తున్నారని రైతులు అంటున్నారు. పంటను కొనుగోలు చేసేంత వరకు షెడ్‌ల కింద ఎండ వేడిని తట్టుకుంటూ పడిగాపులు కాస్తున్నారు. పట్టాదారు మార్కెట్‌యార్డుకు తప్పనిసరిగా రావాలని పీఏసీఎస్ సిబ్బంది సూచిస్తుండడంతో వృద్ధ రైతులు, మహిళలు తిండి, తిప్పలు లేక అవస్థలు పడుతున్నారు. పంట కొనుగోళ్లను పర్యవేక్షించి వేగవంతం చేయాలని మార్కెటింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బందులు లేవు



ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటను విక్రయించాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. నేను 3.5 ఎకరాల్లో జొన్న పంటను సాగు చేయగా 50 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వచ్చింది. మా గ్రామంలోని పంటను శుక్రవారం కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పడంతో గురువారం సాయంత్రం ట్రాక్టర్‌లో ఆదిలాబాద్ మార్కెట్‌యార్డుకు తీసుకువచ్చాను. మధ్యాహ్నం 12.30 దాటినా పీఏసీఎస్ సిబ్బంది నాణ్యత పరిశీలించి, పాసింగ్ చేయడం లేదు. పంటను కొనాలని రైతులు వేడుకున్నా పట్టించుకోవడం లేదు. షెడ్‌లలో వరుస క్రమంలో పంటను పాసింగ్ చేయాల్సి ఉండగా అలా చేయడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పంట కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించారు రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పంటను విక్రయించి మద్దతు ధర పొందారు.

*- భూమన్న, రైతు, అంకోలి, ఆదిలాబాద్ రూరల్ మండలం*



మార్కెట్‌యార్డులో పంట వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

## మాదాపూర్, హీరాపూర్‌లో

# 301 క్వింటాళ్ల జొన్నల పట్టివేత

**కుభీర్‌లో మహారాష్ట్ర వాహనాన్ని అడ్డుకున్న రైతులు**



ఇచ్చోడ మండలం మాదాపూర్‌లో జొన్నలు పట్టుకున్న పోలీసులు, వ్యవసాయాధికారులు

ఇచ్చోడ, మే 2 : మండలంలోని మాదాపూర్‌లో వ్యవసాయ క్షేత్రంలోని రేకుల షెడ్డులో అనుమానాస్పదంగా, సరైన పత్రాలు లేకుండా నిల్వ ఉంచిన 256 క్వింటాళ్ల జొన్నలు పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఏవో గణేశ్, ఆర్ఐ హుస్సేన్ వచ్చి పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం సీజ్ చేసి మార్కెట్‌యార్డు సిబ్బందికి అప్పగించినట్లు తెలిపారు. రైతులు పత్రాలు తీసుకొని వస్తే వదిలి పెడతామని మార్కెట్ యార్డు, వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ రామారావ్ పాల్గొన్నారు.

**హీరాపూర్‌లో 45 క్వింటాళ్ల పట్టివేత**

ఇంద్రవెల్లి, మే 2 : మండలంలోని హీరాపూర్‌లో మార్కెట్ కమిటీ, రెవెన్యూ శాఖ అధికారుల ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద అక్రమంగా జొన్నలు తరలిస్తున్న వాహనాన్ని అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి వాహనంలో 45 క్వింటాళ్ల జొన్నలను బినామీ పేరుతో తీసుకువస్తున్నట్లు ముందస్తుగా అందిన సమాచారం మేరకు మండలంలోని హీరాపూర్‌లోని చెక్‌పోస్ట్ వద్ద వాహనానికి తనిఖీ చేశారు. బినామీ పేరుతో జొన్నలు ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. రెవెన్యూ శాఖ అధికారులు, మార్కెట్ శాఖ అధికారులు జొన్నల వాహనాన్ని పంచనామా చేసి, పోలీసులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, ఎస్ఐ సాయన్న తదితరులు పాల్గొన్నారు.

**మహారాష్ట్ర వాహనాన్ని అడ్డుకున్న రైతులు**

కుభీర్, మే 2 : కుభీర్‌లోని మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రానికి శుక్రవారం మహారాష్ట్ర పాసింగ్ కలిగిన ఐచర్ వాహనం జొన్న సంచులు లోడుతో వచ్చింది. దీన్ని గమనించిన రైతులు, రైతు నాయకులు అడ్డుకుని కేంద్రం బయట నిలిపివేశారు. జిల్లా మార్కెటింగ్ శాఖ, సహకార శాఖల అధికారులకు ఫోన్లో ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు ఆ వాహనాన్ని బయటకు పంపించారు. దళారులు మహారాష్ట్రలోని గ్రామాల్లో తక్కువ ధరకు జొన్నలను కొని ఇక్కడి రైతుల పేర్ల మీద కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మహారాష్ట్ర నుంచి వచ్చిన జొన్నలు ఇక్కడ విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని ఇటీవల ఎమ్మెల్యే రామారావు పటేల్ అధికారులకు హెచ్చరించినా తీరు మారడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఈ దందాకు అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మార్కెట్ కార్యదర్శి గంగన్నను వివరణ కోరగా ఈ వాహనం కుభీర్‌కు చెందినదని తెలిపారు. సరైన పత్రాలు లేక పోవడంతో వాహనాన్ని బయటకు పంపించామని తెలిపారు.

# బినామీ రైతుల పేరిట విక్రయాలు

**రైతు స్వరాజ్య వేదిక ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న**

ఇంద్రవెల్లి, మే 2 : ఇంద్రవెల్లిలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రంలో బినామీ రైతుల పేరిట జొన్నల ను వ్యాపారులు, దళారులు విక్రయిస్తున్నట్లు రైతు స్వరాజ్య వేదిక ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న ఆరోపించారు. శుక్రవారం ఇంద్రవెల్లిలోని మార్కెట్ యార్డులోని జొన్న ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అధికారులు కొనుగోలు చేసిన జొన్నలను పరిశీలించారు. జొన్నలు విక్రయించిన రైతుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొ ర్రన్న మాట్లాడుతూ. వ్యాపారులు, దళారులు గ్రామాలకు వెళ్లి క్వింటాల్ జొన్నలకు రూ. 2200 నుంచి 2500లకు కొనుగోలు చేస్తున్నారు. వాటిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద బినామీ రైతుల పేరిట మద్దతు విక్రయిస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతులు వ్యాపారస్తులతోపాటు దళారుల చేతిలో ఒక్కో క్వింటాల్ వెనుక రూ.800 నుంచి 1000 రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంద్రవెల్లి మార్కెట్ కార్యాలయం నుంచి ఎలాంటి లైసెన్స్‌లు లేకుండానే జొన్నలు కొనుగోలు చేస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంద్రవెల్లి కొనుగోలు కేంద్రంపై విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు దూర్‌రాం, సుంగు, కాంతారావ్, ఎండీ జక్రియా, మల్కాన్ పాల్గొన్నారు.



కొనుగోలు చేసిన జొన్నలను పరిశీలిస్తున్న రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొర్రన్న